క్లుప్తంగా

పారిశుద్ధ్య కార్మికులను నియమించాలి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని టీపీఆర్టీయూ నాయకులు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డికి మంగళవారం హైదరాబాద్‌లో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు హర్షవర్ధన్ రెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు భూపతిసింగ్, జిల్లా అధ్యక్షుడు శ్యాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

గొడవ పడుతున్న భార్యాభర్తలపై దాడి

నవాబుపేట: భార్యాభర్తలు గొడవ పడుతుండగా మధ్యలో వచ్చిన మహిళ, ఆమె కుమారుడు అకారణంగా దాడి చేశారంటూ బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కిషన్‌గూడ గ్రామానికి చెందిన లక్ష్మీదేవి, ఆమె భర్త బాలకిష్టయ్య ఇంటి ముందు మంగళవారం గొడవ పడుతున్నారు. ఆ సమయంలో అటుగా వెళ్తున్న అలవేలు, ఆమె కుమారుడు రాఘవేందర్‌లు వచ్చి లక్ష్మీదేవిపై రాయితో దాడి చేసి గాయపరిచారు. అనంతరం బాలకిష్టయ్యపై కూడా దాడి చేశారు. దీంతో బాధితులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విక్రం తెలిపారు.

భూమి హద్దులు పాతుతుండగా దాడి

నవాబుపేట: 24 ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన భూమికి హద్దులు పాతుతుండగా తమపై దాడి చేశారని బాధితుడు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల వివరాల ప్రకారం .. మండల పరిధిలోని సిద్దోటం గ్రామానికి చెందిన రమేష్ గత 24 ఏళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన వారితో సర్వే నంబర్ 20లో 2ఎకరాల భూమిని కొనుగోలు చేశాడు. తాజాగా వారు తమ భూమిలో హద్దులు పాతుతుండగా గ్రామానికి చెందిన అంజమ్మ, ప్రసాద్‌లు వచ్చి పనులు అడ్డుకుని వారిపై దాడి చేశారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విక్రం తెలిపారు.

పాఠశాలలకు విరాళం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: భూత్పూర్ మండలం తాడిపర్తిలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహించి ఇటీవల పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు విశ్వేశ్వర్ తాను పని చేసిన పాఠశాలలకు విరాళాలు ప్రకటించారు. ఈ మేరకు సంబంధిత చెక్కులను డీఈఓ ప్రవీణ్‌కుమార్‌కు అందజేశారు. పీఎస్ ఖానాపూర్‌కు రూ.5వేలు, పీఎస్ కుల్కచర్ల రూ.5వేలు, పీఎస్ తాటిపర్తి 20వేలు, పీఎస్ హజిలాపూర్ రూ.10వేలు, జెడ్పీహెచ్ఎస్ తాటిపర్తి రూ. 10 వేలు, మహబూబ్‌నగర్ విద్యానిధికి రూ.5 వేలు కేటాయించారు. కార్యక్రమంలో ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, సీఎంఓ బాలుయాదవ్ పాల్గొన్నారు.

నృత్యకారులకు సన్మానం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాకు చెందిన నృత్యకారులు చంద్రశేఖర్, అజీం, మౌనిక, తిరుపతిరాజు, స్వాతి, విజయ, సాయికమలను మంగళవారం స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో సుద్దాల హనుమంతు సాంస్కృతిక వేదిక నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో 'వేదిక' గౌరవాధ్యక్షుడు డా.ఎ.మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి వి.కురుమూర్తి, సభ్యులు రాము, ప్రమోద్‌కుమార్, భరత్, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పద్మ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోచమ్మ బోనాలు

భూత్పూర్: మండలంలోని తాటికొండ గ్రామంలో మంగళవారం సాయంత్రం పోచమ్మ బోనాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బొడ్రాయి ప్రతిష్ఠ నిర్వహించి సంవత్సరం పూర్తి కావొస్తున్న సందర్భంగా మహిళలు, యువతులు బోనమెత్తి వీధుల గుండా పోచమ్మ దేవాలయానికి చేరారు. పోచమ్మకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

భూ భారతిలో సమస్యలు పరిష్కారం



నవాబుపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి
- అవగాహన సదస్సులో కలెక్టర్ విజయేందిర బోయి

నవాబుపేట: రైతులు గతంలో ఎదుర్కొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించేలా భూ భారతి చట్టాన్ని ప్రభుత్వం తీసుకొచ్చిందని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కలెక్టర్ విజయేందిర బోయితో కలిసి భూ భారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ప్రసంగించారు. గతంలో ధరణి వల్ల రైతులు అనేక రకాల ఇబ్బందులు పడ్డారన్నారు. తాను స్వయంగా ధరణి వల్ల ఇబ్బంది పడినట్లు ఎమ్మెల్యే వివరించారు. ఏండ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం తాజాగా భూ భారతి చట్టంలో తాను సైతం వినతి చేసుకుంటున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని కొల్లూర్ గ్రామాన్ని మండలంగా, జడ్చర్లను రెవెన్యూ డివిజన్‌గా చేసేందుకు కృషి చేస్తానని ఆయన వివరించారు.

నిపుణులతో ఏర్పాటు చేసిన చట్టం

రైతులు ఏండ్ల తరబడి ఇబ్బందులు పడుతున్న తీరును చూసి ప్రత్యేక నిపుణుల కమిటీ క్షేత్రస్థాయి అధ్యయనం చేసి ఏర్పాటు చేసిందే ఈ భూ భారతి చట్టమని కలెక్టర్ వివరించారు. భూమి ఉన్న ప్రతి రైతుకు తమ హక్కులకు ఎలాంటి అవరోధం లేకుండా కొత్త ఆర్వోఆర్ చట్టం ఏర్పాటు చేసి రైతులకు అండగా ఈ చట్టం ఉందన్నారు. అవసరమైన రైతులు వారి సమస్యలపై అప్పీలుకు సైతం వెలితే వారికి ఉచిత న్యాయం సలహాలు అందించి న్యాయం చేసేలా ఈ కొత్త చట్టం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతంలో సవరణ లేక ఇబ్బందులు పడ్డ రైతులకు తాజా చట్టంలో సెక్షన్ 4లో సబ్‌సెక్షన్ 4, 5 ప్రకారం భూ రికార్డులు సవరణకు అవకాశం వచ్చిందని, ఇది చాలా మంది రైతులకు వరం లాంటిదని ఆమె తెలిపారు. మే నెలలో ప్రతి జిల్లా నుంచి ఒక మండలం తీసుకుని కొత్త చట్టం అమలు క్షేత్రస్థాయి పరిశీలన ఉంటుందని, అవసరమైతే మరిన్ని మా ర్పులు చేర్పులు జరుగుతాయని ఆమె వివరించా రు. అనంతరం భూ భారతి చట్టంపై రిటైర్డు తహసీల్దార్ జాఫర్‌ల్లాఖాన్‌తో అవగాహన కల్పించి, పవర్‌పాయింట్ ప్రజంటేషన్ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోహన్‌రావు, ఆర్డీఓ నవీన్, మార్కెట్ కమిటీ చైర్మన్ లింగం, తహసీల్దార్ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తులసీరాం నాయక్, మైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్ జగన్ మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాంచంద్ర య్య, బంగ్ల రవి, బాబర్, వెంకటేష్‌గౌడ్, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపిక వేగవంతం చేయాలి

- హౌజింగ్ ఎండీ గౌతమ్



10వ వార్డులో లబ్ధిదారుల ఎంపిక పరిశీలిస్తున్న హౌజింగ్ ఎండీ గౌతమ్

జడ్చర్ల టౌన్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ వేగవంతం చేయాలని హౌజింగ్ ఎండీ గౌతమ్ ఆదేశించారు. మంగళవారం ఆయన మున్సిపాలిటీ పరిధిలోని 3, 10వ వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పరిశీలనను పర్యవేక్షించారు. మున్సిపాలిటీ పరిధిలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ గూర్చి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ గూర్చి ఆయన వాకబు చేయగా దేవరకద్ర మున్సిపాలిటీ అదనపు బాధ్యతలు ఉండడం వల్ల అక్కడికి వెళ్లారని అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ వివరించారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రక్రియ నెమ్మదిగా సాగటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.మే 2 నాటికి లబ్ధిదారుల ఎంపిక పూర్తిచేసి జాబితాను ప్రకటించటంతో పాటు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికలో హౌజింగ్‌శాఖ సైతం కీలకపాత్ర పోషించాలని, క్షేత్రస్థాయిలో పర్యటించాలని పీడీ భాస్కర్‌కు సూచించారు. ముఖ్యంగా మున్సిపాలిటీలో వార్డు అధికారులు హౌజింగ్ అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. లబ్ధిదారుల ఎంపిక చేసిన తరువాత రోజువారిగా లబ్ధిదారుల వివరాలను కలెక్టర్‌ సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. తద్వారా ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయన్నారు. అనంతరం ఆయన మహబూబ్‌నగర్ బయలుదేరారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, హౌజింగ్ పీడీ వైద్యం భాస్కర్, జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి, మున్సిపల్ ఆర్‌ఓ ప్రవీణ్, 10వ వార్డు కౌన్సిలర్ రాజు ఉన్నారు.

బాలానగర్ మండలం మోతిఘనపూర్‌లో..

బాలానగర్ మండలం మోతిఘనపూర్‌లోనూ హౌజింగ్ ఎండీ గౌతమ్ పరిశీలించారు. గ్రామానికి మంజూరైన ఇళ్ల లబ్ధిదారుల వివరాలు తెలుసుకున్నారు. ఎంపిక చేసిన జాబితాను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఎంపీడీఓ అనిల్‌కుమార్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కల్యాణి ఉన్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి



సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి, ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

- కలెక్టర్ విజయేందిర బోయి

చిన్నచింతకుంట: భూ భారతి చట్టం రైతు అవగాహన సదస్సుకు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి అధికారులకు సూచించారు. మంగళవారం చిన్నచింతకుంట మండలం కురుమూర్తి స్వామి జాతర మైదానంలో చిన్నచింతకుంట, కౌకుంట్ల మండలాల రైతులకు నిర్వహించనున్న అవగాహన సదస్సు ఏర్పాట్లను ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. బుధవారం నిర్వహించే రైతు అవగాహన సదస్సుకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమా చార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. సభా ఏర్పాట్లను అధికారులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సదస్సుకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు ఉండాలన్నారు.

సదస్సు విజయవంతం చేయాలి: ఎమ్మెల్యే

భూ భారతి చట్టం రైతు అవగాహన సదస్సుకు రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయ వంతం చేయాలని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి రైతులను కోరారు. కార్యక్రమానికి రైతులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఆర్‌డీఓ నవీన్, డీఆర్‌డీఓ నర్సింహులు, డీపీఓ పార్థసారథి, అధికారులు, కాంగ్రెస్, నాయకులు ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతనలో తీగలపల్లి



నవాబుపేట: మండలంలోని తీగలపల్లి గ్రామం ఆధ్యాత్మిక చింతనతో హోరెత్తుతోంది. గ్రామంలో హనుమాన్ దేవాలయ ప్రతిష్ఠ, ధ్వజస్తంభం, తది తర స్థాపన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం జల, ధాన్యదివాస కా ర్యక్రమాలతో పాటు హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి హా జరై ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం నూతన విగ్రహాల స్థాపన ధ్వజస్తంభ స్థాపన నిర్వహించనున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మండల పర్యటనలో భాగంగా మండలంలోని కాకర్లపహాడ్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లింగం, మైసమ్మ దేవాలయ కమిటీ చైర్మన్ జగన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య, భూపాల్‌రెడ్డి, ఆశన్న, నారాయణ, భీమయ్య, వెంకటేష్, చెన్నప్ప, నారాయణరెడ్డి,, పద్మమ్మ పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా నిరంతరం పఠించాలి



వేములలో మాట్లాడుతున్న సత్యంజీ

అడ్డాకుల: ప్రతి ఒక్కరు హనుమాన్ చాలీసాను నిరంతరం పఠించాలని వీహెచ్‌పీ క్షేత్ర సంఘటన మంత్రి గుమ్మళ్ల సత్యంజీ అన్నారు. మూసాపేట మండలం వేముల గ్రామంలో విశ్వహిందూ పరిషత్ పాలమూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన బాలబాలికల ఆధ్యాత్మిక వ్యక్తిత్వ వికాస శిక్షణా తరగతులు మంగళవారం ముగిశాయి. చివరి రోజు కార్యక్రమానికి హాజరైన సత్యంజీ మాట్లాడుతూ హనుమంతుడిని ఆరాధిస్తే మనోధైర్యం, మానసిక శక్తి కలుగుతాయన్నారు. సనాతన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ప్రాచీన కళల విజ్ఞానం, భగవద్గీత శ్లోకాలు, భారతం, భాగవతం, రామాయణ నీతి కథలపై పిల్లలకు అవగాహన కల్పించాలని కోరారు. వివేకానందుడు, రామకృష్ణ పరమహంసతో పాటు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న మహనీయుల చరిత్రను పిల్లలకు వివరించారు. హిందూ ధర్మ పరి రక్షణకు అందరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రాంత ఉపాధ్యక్షులు జగదీశ్వరయ్య, వీహెచ్‌పీ విభాగ్ ప్రముఖ్ రాచాల జనార్దన్, మాజీ జెడ్పీటీసీ బాలనర్సింహులు, నిర్వాహకులు కొండారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సు ధాకర్‌రెడ్డి, తిరుపతయ్య, అనంతరెడ్డి, తుంగన్న, మాధవరెడ్డి, అంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పహల్గాం మృతులకు ఘన నివాళి



జిల్లా కేంద్రంలో కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న ముస్లింలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలో మంగళవారం రాత్రి మహబూబ్‌నగర్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో పహల్గాం ఉగ్రవాదుల దాడిలో మృతిని చెందిన వారికి నివాళులర్పించారు. అంబేడ్కర్ చౌరస్తా నుంచి తెలంగాణ చౌరస్తా వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఐఎం జిల్లా అధ్యక్షులు అబ్దుల్ హాదీ, అల్‌మేవా రాష్ట్ర అధ్యక్షులు షేక్ ఫారుఖ్ హుస్సేన్, మహ్మద్ తఖీ, వహీద్‌షా, రషీద్, ఫరీద్, ఖలీల్, మీర్ షోయబ్‌అలీ, అబ్దుల్ ఖాదర్, ఎండీ.సలీం, అజీజుర్ రహెమాన్, ఆమెర్ సోహైల్, అజీమ్ సిద్దిఖీ, సాయిబాబా, ప్రవీణ్‌కుమార్, అజ్మత్, తదితరులు పాల్గొన్నారు.

'రాజ్యాంగాన్ని కాపాడుకుందాం'



శివశక్తినగర్‌లో సంక్షేమ పథకాలను వివరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం చేస్తోందని, దానిని కాపాడుకోవాలని 23వ డివిజన్ 'జై బాపు.. జై భీం.. జై సంవిధాన్' ఇన్‌చార్జి అజ్మత్‌అలీ అన్నారు. మంగళవారం స్థానిక శివశక్తినగర్, దోబీవాడ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎల్లంగారి భరత్ కుమార్, నరేష్‌బాబు, మొక్రం, షమీం, ఏర్పుల నాగరాజు, జహీర్, అబ్దుల్‌హక్, తాహెర్, షకీల్, అనిత, శ్రావణి పాల్గొన్నారు.

బాల కేంద్రంలో రాజారవివర్మ జయంతి



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా బాల కేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ నృత్య దినోత్సవంతో పాటు రాజారవివర్మ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా జానపద, సంప్రదాయ నృత్యం, విశిష్టతను బాల కేంద్రం పర్యవేక్షకుడు రాజేష్‌ఖన్నా అక్కడి చిన్నారులకు వివరించారు. కార్యక్రమంలో శిక్షకులు దివ్య, హైదవి, సరోజ, వెంకటేశ్వరమ్మ, గజేంద్ర, సునీత పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యం



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించిన అధ్యాపకులు

మహమ్మదాబాద్: ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించడమే తమ లక్ష్యమని కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్ తెలిపారు. మండల కేంద్రంలోని ఇంటర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఆయన సిబ్బంది గ్రామ పెద్దలతో కలిసి సన్మానం చేశారు. మహమ్మదాబాద్ మండల కేంద్రానికి కొత్తగా ఏర్పాటు చేసుకున్న ఇంటర్ కళాశాలలో అనుకున్నంత మంది విద్యార్థులు చేరారని, ప్రభుత్వం కొత్త సిబ్బందిని ఇటీవలె ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొదట కళాశాల కొనసాగించేందుకు సిబ్బంది లేక, వారికి వేతనాలు లేక ఎన్నో అవస్థలు పడ్డామని తెలిపారు. అలాంటి సమయంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిధులతో సిబ్బందికి వేతనాలు ఇచ్చి కళాశాలను మంచి స్థానంలో పెట్టారని తెలిపారు. అదే సమయంలో విద్యార్థులు కూడా మంచి మార్కులు సాధించడం ఎంతో మేలు జరిగిందన్నారు. వచ్చే సంవత్సరం విద్యార్థులు కష్టపడి చదివి కళాశాలను జిల్లాలో ఉత్తమస్థానంలో నిలబెట్టాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు అనంతయ్యగుప్త, సిబ్బంది ఉన్నారు.

అమరుల స్ఫూర్తితో మేడే ఉత్సవాలు

జడ్చర్ల టౌన్: కార్మికుల హక్కుల పరిరక్షణ ఉద్యమంలో అసువులు బాసిన అమరులైన వారి స్ఫూర్తితో మేడే ఉత్సవాలు వైభవంగా నిర్వహించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య పిలుపునిచ్చారు. మంగళవారం జడ్చర్ల మున్సిపాలిటీ కార్యాలయంలో ఆఫీస్ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌కు కార్మికుల సమస్యలపై విన తిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడే రోజు మున్సిపల్ కార్యాలయంతో పాటు అన్ని ముఖ్యకూడళ్లలో ఎర్రజెండాలు ఎగరవేసి ర్యాలీ నిర్వహిద్దామన్నారు. అంబేడ్కర్ క ళాభవన్ వద్ద నిర్వహించే సభకు అధిక సంఖ్యలో హాజరు కావాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కా ర్మికుల సమస్యలపై వినతిపత్రం అందజేసి వాటిని వెంటనే పరిష్కరించాలని కోరారు. మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, పట్టణ ఆర్గనైజింగ్ సెక్రటరి కృష్ణ, అంజ మ్మ, జంగయ్య, అరుణ్‌కుమార్, రాజులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టండి



బస్వాపూర్‌లో ఇందిరమ్మ లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారి

దేవరకద్ర: మండలంలోని బస్వాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులు చేపట్టాలని ఎంఈఓ బలరాం కోరారు. మంగళవారం ప్రత్యేక అధికారిగా గ్రామాన్ని సందర్శించిన ఎంఈఓ గ్రామానికి మంజూరైన 19 మంది లబ్ధిదారులతో మాట్లాడారు. పనులు చేపట్టిన వారు వేగవంతం చేయాలని, ఇంకా ప్రారంభించని వారు వెంటనే పనులు చేపట్టాలని కోరారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి వెంకట్రాములు, తదితరులు పాల్గొన్నారు.

మేడే కరపత్రం ఆవిష్కరణ



మేడే కరపత్రం ఆవిష్కరిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మే 1న ని ర్వహించనున్న ప్రపంచ కార్మిక దినోత్సవం కరపత్రం ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడియాల మోహన్ ఆవిష్కరించారు. మన్యకొండ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆ యన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాయని, దీన్ని ఐక్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చా రు. కార్మికులు, కర్షకులు మేడే వేడుకల్లో పాల్గొ ని ఐక్యతను చాటాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు హన్మంతు, ఆటో యూ నియన్ అధ్యక్షుడు చిన్న వెంకట్రాములు, ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు, రామచంద్ర య్య, రవినాయక్, బాలయ్య పాల్గొన్నారు.

ప్రజాపాలనలో పక్షపాతం



పూరి గుడిసెలో నివాసం ఉంటున్న పస్పుల గంగమ్మ

- అర్హులకు బదులుగా అనర్హులకు అందలం
- అధికారుల తీరుపై ప్రజల ఆగ్రహం



హన్వాడలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వేలో అధికారులు

హన్వాడ: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం అధికారుల తీరుతో అబాసుపాలయ్యే ప్రమాదం పొంచి ఉంది. మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల అధి కారులు ఇళ్లిళ్లు తిరిగి లబ్ధిదారుల ఎంపికపై సర్వే చేస్తున్నారు. ఈ సర్వేల్లో అధికారులు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారుల వివరాలు సేకరిస్తున్నారు. మండలంలోని యారోనిపల్లికి చెందిన పలువురు ఇళ్లు లేని నిర్వాసితులు తమకు ఇళ్లు రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ గ్రామానికి మొత్తం 12 ఇళ్లు మంజూరు కాగా, వారిలో చాలా మందికి రేకులు, పెంకుటిళ్లు, డాబా ఇళ్లు ఉన్న వారినే అర్హులుగా గుర్తిస్తూ అధికారులు జాబితా చేపట్టి ఇంటికి తిరిగి లబ్ధిదారుల వివరాలు సేకరిస్తున్నారు. ప్రజాపాలనలో దరఖాస్తులు పెట్టుకున్న తమకు ఇళ్లు రాలేదని పస్పుల తిర్పతమ్మ, గంగమ్మ, తంగేడి వెంకటమ్మ, యాదమ్మ, బాలమ్మ, పస్పుల భీమయ్య, అంజమ్మ, నత్తిబస్సమ్మ, పుష్పమ్మ, పల్లపు వెంకటమ్మ, ఓర్సు మైబమ్మ, పస్పుల నర్సింహులు, బాలయ్య ఆందోళన వ్యక్తం చేశారు. వీరిలో పలువురు గ్రామంలో పూరిగుడిసెలు వేసుకుని జీవనం చేస్తుండగా, మరి కొందరు ఉన్న ఊరిలో ఇళ్లు లేక పనులు దొరక్క వలసవెళ్లి బతుకుతున్నారు. ఈ విషయం పై అధికారులను స్థానికులు నిలదీయగా నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నాళ్లు పూరిగుడిసెల్లో బతుకులు వెళ్లదీయాలని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఊళ్లో లబ్ధిదారులను మళ్లీ పరిశీలన చేస్తాను..

యారోనిపల్లి గ్రామానికి 12ఇళ్లు మంజూరయ్యాయి. ఆ గ్రామానికి పీఆర్ ఏఈ ప్రత్యేకాధికారి. వారి పర్యవేక్షణలో లబ్ధిదారుల ఎంపిక చేశారు. అక్కడ ఎవరెవరికి ఇళ్లు మంజూరయ్యాయే నాకు తెలియదు. నేనే స్వయంగా వెళ్లి మళ్లీ లబ్ధిదారుల ఎంపికపై రీ సర్వే చేసి అర్హులను గుర్తిస్తాం . అర్హులకే ఇళ్లు మంజూరి చేస్తాం.

– యశోదమ్మ, ఎంపీడీఓ, హన్వాడ

ఊరిలో ఇల్లు లేక.. పట్నానికి వలసెళ్లాం..



మాకు ఊరిలో చిన్నపూరి గుడిసె ఉంది. వర్షాకాలం గుడిసెలో ఉండలేం. దీంతో మహబూబ్‌నగర్‌లో అద్దె ఇంట్లో నివసిస్తున్నాం. ఉదయం లేచి ఇళ్లల్లో పని చేయడం, నా భర్త ఆటో తోలుతూ జీవనం సాగిస్తున్నాం. కష్టపడి గ్రామంలో ఓ ప్లాటు కొని పూరిగుడిసె వేసుకున్నాం. ప్రజాపాలనలో పక్కా ఇల్లు కట్టుకుందామని దరఖాస్తు చేస్తే అధికారులు మాకు ఇళ్లు రాలేదని తిరస్కరిస్తున్నారు. మా గోస ఎవరికి చెప్పుకోవాలే. ప్రభుత్వం మాకు ఇళ్లు మంజూరు చేస్తే ఉన్న ఊళ్లో ఏదో పని చేసుకుని బతుకుతాం.

– పస్పుల గంగమ్మ, యారోనిపల్లి

ఇళ్లు ఉన్నోళ్లకే ఇచ్చారు..



ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్నోళ్లకు ఇళ్లు ఇస్తామంటే సంబరపడ్డాం. ఇళ్లు వస్తుందని, కష్టాలు తీరతాయని అనుకున్నాం. అధికారులు మాలాంటోళ్లను గుర్తించ లేదు. 18 ఏళ్లుగా పూరిగుడిసెలో ఉంటున్నాం. దీంతో నా పేరు గుడిసె వెంకటయ్యగా గుర్తింపు వచ్చింది. ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామంటే సంబరపడ్డాం. కానీ నాకు ఇళ్లు రాలేదని అధికారులు చెప్పారు. దయ ఉంచి మాకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి.

– తంగేడి వెంకటయ్య, యారోనిపల్లి